100 రోజుల ప్రగతిపై నివేదికలు సిద్ధం చేయాలి

కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్

విశాలాంధ్ర-విజయనగరం ఫోర్ట్: వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక అమలుపై ఖచ్చితమైన నివేదికలను రెండు రోజుల్లోగా సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ వివిధ శాఖల అధికారులను ఆదేశించారు. కార్యాచరణ ప్రణాళికల ప్రగతిపై కలెక్టరేట్ ఆడిటోరియంలో సోమవారం సాయంత్రం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఆయా శాఖల ప్రగతిని పరిశీలించారు. వ్యవసాయ, ఉద్యాన, గృహనిర్మాణం, బిందు తుంపర సేద్యం తదితర శాఖల ప్రగతిపై ఆరా తీశారు. బుధవారం నాటికి సమగ్ర నివేదికలను అందజేయాలని కలెక్టర్ కోరారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్, సిపిఓ పి.బాలాజీ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన ఎంఈఓ-2

విశాలాంధ్ర-మెరకముడిదాం: మెరకముడిదాం మండలంలో ఎస్సీ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఎంఈఓ2, లోకల్ టిడిపి నాయకులు రామకృష్ణ రాజుతో సోమవారం సందర్శన చేసి పరిశీలించారు.మధ్యాహ్న భోజనము ఎలా ఉందని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పిల్లలకు రుచికరమైన భోజనం పెట్టాలని సూచించారు. పాఠశాల హెచ్ఎం కు మధ్యాహ్న భోజన సిబ్బందికి సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో సి ఆర్ పి శంకర్రావు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మైనర్లకు వాహనాలు ఇస్తే కేసులు నమోదు

విశాలాంధ్ర-రామభద్రపురం: 18 సంవత్సరాల లోపు పిల్లలకు వాహనాలు ఇస్తే కేసులు నమోదు చేస్తామని బొబ్బిలి రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ కె నారాయణ రావు అన్నారు. సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్లో మైనర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడారు. 18 సంవత్సరాలు నిండి ఉండి తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్సు ఉంటేనే వాహనాన్ని నడపాలని అన్నారు. లేదంటే వాహనంపై కేసు నమోదు చేసి సీజ్ చేస్తామని హెచ్చరించారు. వాహనానికి సంబంధించిన ఇన్సూరెన్స్, పర్మిట్, పొల్యూషన్ వంటి పత్రాలు ఉండాలని అన్నారు. ద్విచక్ర వాహనదారుడు కచ్చితంగా హెల్మెట్ ధరించాలని కోరారు. అలాగే ప్రతి వాహనదారుడు రోడ్డు నిబంధనలు పాటించాలని అన్నారు. త్రిబుల్ రైడింగు, సెల్ఫోన్ లో మాట్లాడుతూడ్రైవింగ్ చేయడం నేరమని అన్నారు. కార్యక్రమంలో స్థానిక ఎస్సై వెలమల ప్రసాదు హెడ్ కానిస్టేబుల్ నారాయణ పాల్గొన్నారు.

టిడిపి సభ్యత్వంతో ప్రమాద బీమా సౌకర్యం

విశాలాంధ్ర-గుర్ల: తెలుగుదేశం పార్టీ సభ్యత్వం తీసుకోవడం ద్వారా ప్రతి ఒక్కరికి ప్రమాద బీమా వర్తిస్తుందని పాలవలస తెలుగుదేశం పార్టీ నాయకులు గేదెల అప్పల నాయుడు, గేదెల లక్ష్మి అన్నారు. పాలవలసలో టిడిపి సభ్యత్వం నమోద సోమవారం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సభ్యులుగా చేరిన ప్రతి ఒక్కరికి పార్టీ అండతో పాటు ప్రమాద బీమా కూడా వర్తిస్తుంది అన్నారు. ఇప్పటివరకు సుమారు 150 సభ్యత్వాలు చేసామని తెలిపారు. సభ్యత్వం నమోదు కార్యక్రమంలో ప్రశాంత్, నారాయణరావు, గౌరినాయుడు, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

డ్వాక్రా మహిళలకు న్యాయం చేయండి

విశాలాంధ్ర-తెర్లాం: మండలంలో సోమవారం కుసుమూరు గ్రామానికి చెందిన మరియమ్మ అనే పేరుగల డ్రోక్రా సంగం సభ్యులకు తెలియకుండా దొంగ సంతకాలతో 700000/- రూపాయిల లోన్ పెట్టించారని, ఆ మొత్తాన్ని గ్రూపులో వున్నా కొంత మందికి ఇచ్చి మిగతా వారిని మోసం చేశారు. జనసేన పార్టీ తెర్లాం మండల అధ్యక్షులు మరడాన రవి కి కుసుమురు జనసైనికులు అశోక్, బాధితులు సమస్యను తీసుకొచ్చారు, అయన స్పందించి వెలుగు ఏ పి ఎమ్ తో మాట్లాడి బాధితులకు న్యాయం చేయాలనీ, అదే విధంగా తప్పు చేసిన వారిని శాఖపరంగా చర్యలు తీసుకోవాలని వినతిపత్రం ఇవ్వడం జరిగింది.

రామన్న దొర వలస గిరిజనులకు ఇచ్చిన సీలింగ్ భూములు గిరిజనులకు అప్పగించాలి

తాసిల్దార్ కు గిరిజనులు వినతి

విశాలాంధ్ర-బొబ్బిలి: పట్టణం రామన్న దొర వలస గ్రామానికి చెందిన గిరిజనులకు 1972 సంవత్సరంలో 35 కుటుంబాలకు 90 ఎకరాలు సీలింగ్ యాక్ట్ కింద గొల్లపల్లి రెవిన్యూ పరిధిలో సర్వే నంబర్ 554లో ఒకటి లో అప్పట్లో ప్రభుత్వం డి పట్టాలను మంజూరు చేసిందని 2004వ సంవత్సరంలో ఎన్సిఆర్ బహదూర్ పేరున ఏడెకరాల 71 సెంట్లు భూమి రెవిన్యూ రికార్డులో మార్పి వేశారని రామన్న దొర వలస కౌన్సిల్ సభ్యులు కొర్లాపు రామారావు ఆధ్వర్యంలో పలువురు గిరిజనులు తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ ఎం శ్రీనుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాధితులు తాసిల్దార్ తో మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు వివిధ రంగ కొంతమంది ప్రభుత్వ ఉద్యోగులు గిరిజనులు ఇచ్చిన భూమిని కబ్జా చేశారని ఆరోపణలు చేశారు. ఏగిరెడ్డి నాగేశ్వరరావు గిరిజనులు పై దౌర్జన్యాలకు పాల్పడుతున్నాడని వారి నుండి గిరిజనులకు రక్షణ కల్పించాలని కోరారు. ప్రభుత్వం ఇచ్చిన సీలింగ్ భూములు ఆక్రమణతో 35 గిరిజన కుటుంబాలు రోడ్డు పడ్డాయని తక్షణమే పూర్తిస్థాయిలో దర్యాప్తు చేసి గిరిజనులకు ఆ భూముల అప్పగించాలని డిమాండ్ చేశారు. గిరిజనులు ఇచ్చిన వినతిపత్రం పైన తహశీల్దార్ ఎం శ్రీను మాట్లాడుతూ పూర్తిస్థాయిలో దర్యాప్తు చేసి న్యాయం చేస్తామని తెలిపారు. తాసిల్దార్కి వినతిపత్రం అందజేసిన వారిలో కే రామారావు, రామన్న దొర, శ్రీనివాసరావు, కే రవణమ్మ, తదితరులు ఉన్నారు.

ఎన్నికల పరిశీలకులు ఎం ఎం నాయక్ జిల్లాకు రాక

ఉప ఎన్నిక ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష



విశాలాంధ్ర-విజయనగరం: శాసన మండలి స్థానిక సంస్థల నియోజకవర్గ ఉప ఎన్నికకు ఎన్నికల పరిశీలకులుగా నియమితులైన సీనియర్ ఐ.ఏ.ఎస్. అధికారి, రాష్ట్ర పశుసంవర్ధక శాఖ కార్యదర్శి ఎం ఎం నాయక్ సోమవారం జిల్లాలో పర్యటించారు. ఉదయం జిల్లా పరిషత్ అతిథి గృహానికి చేరుకున్న ప్రభుత్వ కార్యదర్శి కి కలెక్టర్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, జేసీసేతు మాధవన్, డిఆర్ఓ శ్రీనివాసమూర్తి ఆర్డిఓ కీర్తి తదితరులు స్వాగతం పలికారు. అనంతరం కలెక్టర్, జెసి ఎన్నికల పరిశీలకులతో సమావేశమై శాసనమండలి ఉప ఎన్నికల ఏర్పాట్లపై వివరించారు. ఎన్నికల ప్రవర్తన నియమాలు అమలు, ఎం .సి.సి.బృందాలు ఏర్పాటు తదితర అంశాలను తెలిపారు. జిల్లాకు గతంలో కలెక్టర్ గా పనిచేసిన ముఖ్య కార్యదర్శి నాయక్ జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి గురించి కూడా జిల్లా కలెక్టర్ ను అడిగి తెలుసుకున్నారు. భోగాపురం ఎయిర్పోర్ట్ నిర్మాణం ఇతర ప్రాజెక్టులు తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆయనకు వివరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ కార్యాలయానికి ఎన్నికల పరిశీలకులు నాయక్ చేరుకుని రిటర్నింగ్ అధికారిగా వ్యవహరిస్తున్న జాయింట్ కలెక్టర్ ఛాంబర్ కి వెళ్లి నామినేషన్ల ప్రక్రియ జరుగుతున్న తీరును పరిశీలించారు. ఉప ఎన్నికకు దాఖలైన నామినేషన్ వివరాలు జాయింట్ కలెక్టర్ ఆయనకు వివరించారు.

అబుల్ కలామ్ ఆజాద్ సేవలు స్ఫూర్తిదాయకం

-కలెక్టర్ డా॥ బిఆర్ అంబేద్కర్
- ఘనంగా మైనారిటీల సంక్షేమ దినోత్సవం

విశాలాంధ్ర-విజయనగరం: భారత రత్న మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ జాతికి చేసిన సేవలు ఎంతో స్ఫూర్తి దాయకమని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కొనియాడారు. భారత దేశ ప్రథమ విద్యాశాఖామంత్రి అబుల్ కలామ్ ఆజాద్ జన్మదినోత్సవం సందర్భంగా, జాతీయ విద్యా దినోత్సవాన్ని, మైనారిటీల సంక్షేమ దినోత్సవాన్ని కలెక్టరేట్ ఆడిటోరియంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. అబుల్ కలామ్ ఆజాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అంబేద్కర్ మాట్లాడుతూ, అబుల్ కలామ్ సమాజానికి చేసిన సేవలకు గుర్తుగా ఆయన పుట్టినరోజును జాతీయ విద్యా దినోత్సవంగా, మైనారిటీల సంక్షేమ దినోత్సవంగా ప్రభుత్వం నిర్వహిస్తోందని చెప్పారు. ఆ మహనీయుని ఆశయాలు, బోధనలు జాతికి సదా అనుసరణీయమని పేర్కొన్నారు. వాటిని సాధించడమే అబుల్ కలామ్ ఆజాద్ కు నిజమైన నివాళి అని అన్నారు. దేశంలో మైనారిటీ, మెజారిటీ అంతా సోదర సమానులేనని, ఎటువంటి తారతమ్యాలు లేవన్నారు. ఆదే స్ఫూర్తితో ముందుడగు వేసి, అభివృద్ధి సాధనకు కృషి చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ, మైనారిటీల అభివృద్ధికి ప్రభుత్వం కృత నిశ్చయంతో పనిచేస్తోందని చెప్పారు. వీరికోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను చిత్తశుద్ధితో అమలుచేసి, అర్హులందరికీ అందజేయాలని కోరారు. జిల్లా మైనారిటీ సంక్షేమా ధికారి ఆర్.ఎస్.జాన్, జిల్లా ఖజానా అధికారి కుమార్, మైనారిటీ సోషల్ వర్కర్ షేక్ అబ్దుల్ కరీమ్ వాజిద్, వివిధ మతాల పెద్దలు, సంఘాల ప్రతినిధులు ఫాస్టర్ వై.ప్రభాకర్, మహ్మద్ రఫీ, సిస్టర్ జ్యోతి బచావత్, డాక్టర్ బాబ్జీ జస్వీర్ సింగ్, టి.శ్యామ్యూల్ రాజ్, ఆర్ఈ రాణి, బిఎంరాజు, ఎంఏ నాయుడు, మహ్మద్ హబీబ్, మహమ్మద్ అమానుల్లా, ఫాతిమా జెహ్రా తదితరులు మాట్లాడారు. ఈ సందర్భంగా పలువురు మత పెద్దలు, సంఘ ప్రతినిధులకు కలెక్టర్ చేతులమీదుగా సన్మానించి, జ్ఞాపికలు బహూకరించారు.

దీర్ఘకాల అద్దె బకాయిలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదు: కమిషనర్ నల్లనయ్య

విశాలాంధ్ర-విజయనగరం అర్బన్ : విజయనగరం నగరపాలక సంస్థ అధీనంలో ఉన్న దుకాణాల దీర్ఘకాల అద్దె బకాయిలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని కమిషనర్ పి.నల్లనయ్య స్పష్టం చేశారు. ఈ మేరకు కమిషనర్ ఆదేశాలతో ఐడిఎస్ఎంటి షాపింగ్ కాంప్లెక్స్ ప్రాంతాల్లో ఉన్న కొన్ని దుకాణదారులు అద్దెలు బకాయిలు ఉండటంతో తక్షణమే వాటిని చెల్లించాలని రెవెన్యూ సిబ్బంది కోరారు. అయినప్పటికీ అద్దెలు చెల్లించకపోవడంతో సోమవారం రెవెన్యూ సిబ్బంది సదరు దుకాణాలకు తాళాలు వేసి సీజ్ చేశారు. ఈ మధ్యకాలంలో చాలామంది దుకాణాల అద్దెలు చెల్లించకుండా దీర్ఘకాలంగా ఉండటంతో వాటిని తక్షణమే చెల్లించాలని కమిషనర్ ఆదేశించడంతో చాలావరకు అద్దెలను సదరు దుకాణదారులు చెల్లించారు. అయితే కొంతమంది ఇంకా మొండి బకాయిదారులు ఉండడంతో వాటికి ఈరోజు తాళాలు వేశారు. ఈ సందర్భంగా కమిషనర్ పి.నల్లనయ్య మాట్లాడుతూ ఆస్తి పన్నులు, దుకాణాల అద్దె చెల్లింపులు ద్వారా నగరపాలక సంస్థ కు రావలసిన బకాయిలను తక్షణమే చెల్లించాలని చెప్పారు. నగరాభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. మూడు నెలలు అంతకన్నా ఎక్కువ కాలం పాటు అద్దె బకాయిలు ఉన్నట్లయితే అట్టి దుకాణాలకు విద్యుత్ సరఫరాను కూడా నిలిపివేస్తామని స్పష్టం చేశారు. కావున త్వరితగతిన అద్దె బకాయిలను చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్స్పెక్టర్లు సాయిప్రసాద్, చిన్నంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను జయప్రదం చేయండి

విశాలాంధ్ర-విజయనగరం రూరల్ : జిల్లా గ్రంథాలయ సేవా సంఘం ఆధ్వర్యంలో ఈనెల 14 నుండి 20 వరకు నిర్వహించనున్న 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను జయప్రదం చేయాలనీ సంఘం గౌరవ అధ్యక్షులు నాలుగెస్సులరాజు, వ్యవస్థాపకులు అబ్దుల్ రవూఫ్, ఉపాధ్యక్షులు కె.దయానంద్, ప్రధాన కార్యదర్శి బాలకృష్ణ లు కోరారు. సోమవారం సంఘ కార్యాలయంలో వారోత్సవాల కార్యక్రమాలకు సంభందించిన షెడ్యూలును విడుదల చేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వారం రోజుల పాటు జిల్లా వ్యాప్తంగా వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని, ప్రధానంగా ర్యాలీలు, గ్రంథాలయాలకు పుస్తక వితరణ, విద్యార్థులకు వ్యాసరచన పోటీలు, నూతన పుస్తక ఆవిష్కరణ, పుస్తక ప్రదర్శన, జాతీయ పత్రికా దినోత్సవం సందర్భంగా పాత్రికేయులకు సత్కారం, మహిళా రచయితలకు సత్కారం, గ్రంథాలయ ఉద్యమ కార్యకర్త రెడ్డి రమణ స్మారక పురస్కారంతో పా టు పాఠశాలలు, కళాశాలలలో గ్రంథాలయ చైతన్య సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. గ్రంథాలయాలను ప్రజలకు చేరువ చేసేందుకు వారోత్సవాలు ఎంతగానో దోహదపడతాయని అన్నారు. కార్యక్రమంలో జనవిజ్ఞానవేదిక జిల్లా అధ్యక్షులు డాక్టర్. ఎన్ వి ఎన్ వెంకటరావు, విశ్రాంత గ్రంథాలయ సంస్థ అధికారి బి. రామభద్రరాజు, గమ్యం స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు వేమలి చైతన్య బాబు, వాకర్స్ శ్రీరామూర్తి, జనార్దనరావు, కందాల సాయిబాబా, సాయిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్లో జిల్లా పై సీత కన్ను

సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బుగత అశోక్

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: 2024-25 ఆర్థిక సంవత్సరానికి 2,94,427.25 కోట్లతో సోమవారం అసెంబ్లీలో ఆర్థిక మంత్రి రాష్ట్ర బడ్జెట్ ప్రవేశపెట్టారు. కేవలం నాలుగు నెలలకు మాత్రమే ప్రవేశపెడుతున్న బడ్జెట్ ఇది. బడ్జెట్ ప్రసంగం మొదట్లోనే ఆర్థిక మంత్రి రాష్ట్రంలో ఆర్థిక విధ్వంసం జరిగిందని చెప్పారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాలేదని చెబుతూనే ఓటాన్ ఎకౌంట్ బడ్జెట్ కంటే ఈ బడ్జెట్ మొత్తాన్ని అధికంగా చూపి మొత్తానికి అంకెలతో గారడీ ప్రదర్శించడం జరిగిందన్నారు. ద్రవ్యలోటు రూ. 68,742.65 కోట్లుగా, రెవెన్యూ లోటు రూ.34,712.84 కోట్లుగా సూపర్ అన్నారు. ఈ లోటును ఏ రకంగా భర్తీ చేస్తారో చెప్పలేదన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు నియంత్రణ పై ఊసే లేదని, విద్యుత్ రంగం విషయంలో ప్రజల పైన భారాలు పడుతున్నాయన్నారు. ప్రజలపై విద్యుత్ భారాలు మోపకుండా పరిష్కారం చూపలేక పోయారని తెలిపారు. కౌలు రైతుల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత కనబడలేదన్నారు కార్మికవర్గాన్ని విస్మరించారు. వాలంటీర్లు ఉద్యోగ భద్రత కోసం ప్రస్తావన లేదని, జిల్లాలో మూతపడిన పరిశ్రమలు తెరవడానికి, కొత్త పరిశ్రమలకి తేవడానికి, జిల్లాలో పెండింగులో ఉన్న నీటి ప్రాజెక్టులు పై, జిల్లాలో వలసల నివారణకు చర్యలు లేవన్నారు, మెడికల్ కాలేజ్ నిర్మాణం పూర్తికి , జిల్లాలో ప్రభుత్వ వైద్య శాలలు మెరుగు కోసం ఎటువంటి ప్రకటన లేదన్నారు. రాష్ట్ర బడ్జెట్లో జిల్లా సమగ్ర అభివృద్ధికి ఎలాంటి కేటాయింపులు లేకపోయినా స్థానిక ఎమ్మెల్యేలు నోరు మెదపకుండ ఆర్థికమంత్రి చూపిస్తున్న అంకెల గారడీలో నిమగ్నమై పోయారన్నారు

భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు పునరుద్ధరించాలి

ఏఐటియుసి జిల్లా అధ్యక్షులు రంగరాజు

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునర్దరించాలని ఏఐటియుసి జిల్లా అధ్యక్షులు ఎస్ రంగరాజు డిమాండ్ చేశారు. సోమవారం ఆంధ్రప్రదేశ్ బిల్డింగ్ కన్స్ట్రక్షన్స్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి)ఆధ్వర్యంలో స్థానిక అమర్ భవన్లో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు ఎస్ రంగరాజు మాట్లాడుతూ ఎన్నో ఇబ్బందులు పడుతూ జీవితాలను నెట్టుకొస్తున్న భవన నిర్మాణ కార్మికులకు వెంటనే సంక్షేమ బోర్డును పునర్దరించాలన్నారు .ఇసుక త్రవ్వకం ప్రైవేటు ఏజెన్సీలకు ఇవ్వడం వెంటనే నిలిపివేయాల న్నారు. ప్రభుత్వమే ఇసుక ర్యాంపులు నడపాలని అన్నిరకాల పన్నులు ఎత్తివేయాలన్నారు. పెండింగ్ లో ఉన్న 42 వేల క్లెయిమ్లకు నిధులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మిక సంక్షేమ బోర్డు నుండి గతంలో దారి మళ్ళించిన నిధులను తిరిగి సంక్షేమ బోర్డుకు జమ చేయాలన్నారు.ఇతర రాష్ట్రాల తరహాలో ఆంధ్రప్రదేశ్లో సంక్షేమబోర్డు చట్టం 1996ను ప్రవేశపెట్టాలన్నారు. సిమెంట్, ఐరన్, కలప, ఎలక్ట్రికల్స్, పాత్రలు, స్టోన్ లాంటి గృహోపకరణాల ధరల నియంత్రించాలన్నారు. ఎన్ని ప్రభుత్వాలు మారిన వీరికి ఎన్నడు న్యాయం జరగలేదన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి వీరిని ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ కార్యదర్శి దేగల అప్పలరాజు ,యూనియన్ నాయకులు మజ్జి ఆదిబాబు,ఆల్తి చిన మారయ్య, కొండల కొండబాబు, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

పోలవరం ఎడమ కాలువ డిజైన్ మార్చాలి

ఏపీ రైతు సంఘం జిల్లా సమితి డిమాండ్

విశాలాంధ్ర-శృంగవరపుకోట: పోలవరం ఎడమ కాలువ డిజైన్ మార్చాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా సమితి ప్రధాన కార్యదర్శి దేగల అప్పలరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన తాసిల్దార్ అరుణ్ కుమారికి వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ. కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలో భాగంగా ప్రతి రైతుకు పెట్టుబడి సాయం కింద 20 వేలు ఇస్తామని ప్రకటించారు. నేటికీ ఈ ప్రభుత్వం ఏర్పడి ఐదు నెలలు అయినా రాష్ట్రంలో ఏ ఒక్క రైతుకు ఇంతవరకు పెట్టుబడి సాయం అందించలేదు ఇప్పటికే రైతు సంఘం ఆధ్వర్యంలో నాలుగో తారీఖున రాష్ట్రవ్యాప్తంగా తన శక్తి మేరకు రైతులను కూడగట్టి సచివాలయాల్లో తెలియజేయడం జరిగింది రెండో దశ పోరాటంలో భాగంగా తాసిల్దారులకు మూడో దశలో కలెక్టర్ గార్లకు రాష్ట్రవ్యాప్తంగా విజ్ఞాపన పత్రాలు ఆందోళనలో చేయడం జరుగుతుందని తెలియజేశారు అలాగే పోలవరం ఎడమ కాలువ కొత్తవలస ప్రాంతంలో నేరుగా భూదే చెరువు నుండి విశాఖ జిల్లా భూదే చెరువు నుండి వేపాడకు వేపాడ్ నుండి కరకవలసి మీదుగా పుణ్యగిరి వయా చిలకల గడ్డకు ఇవ్వాలని ఆ రకంగా పోలవరం కాలువ డిజైన్ మార్చాలని తెలియజేశారు అంతే కాక అంతవరకు తాటిపూడి రాయివాడ నీరు ఈ ప్రాంత రైతులకు గంట్యాడ మండలానికి సాగుకు త్రాగుకు ఇవ్వాలని తెలియజేశారు ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు గండేపల్లి భీముడు రైతు సంఘం జిల్లా నాయకులు కొటాను సూర్యం మోపాడ రమణ ఎస్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ విద్యా దినోత్సవం

విశాలాంధ్ర-వేపాడ: మండలంలోని సోంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయవిద్యా దినోత్సవం ఘనంగా నిర్వహించడం జరిగిందని పాఠశాల ప్రదానో పాధ్యాయుడు బి.పి. ఏ.రాజు తెలియజేసారు.రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు భారత ప్రథమ విద్యా శాఖా మంత్రి మౌలానా అబుల్ కలాం అజాద్ జన్మ దినాన్ని పురస్కరించుకొని ప్రతీ ఏటా నిర్వహిస్తున్న జాతీయ విద్యా దినోత్సవం సందర్భంగా ఉదయం మౌలానా చిత్ర పటానికి నివాళులార్పించారు.ఈ సందర్భంగా మధ్యాహ్నం "విద్యా ఆవశ్యకత "అనే అంశం పై వకృత్వ పోటీ నిర్వహించారు.ఆయా తరగతి ఉపాధ్యాయుల పర్యవేక్షణలో జరిగిన ఈ పోటీలలో ప్రథమ, ద్వితీయ,త్రితీయ స్థానాలు పొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆతవ రవిశంకర్, శ్రీను వాసరావు, సన్యాసి రావు, రమేష్ నాయుడు, ఉపాధ్యాయ సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఉప ఎన్నికలకు మొత్తం మూడు నామినేషన్లు

చివరి రోజు ఇద్దరు ఇండిపెండెంట్ ల నామినేషన్

విశాలాంధ్ర-విజయనగరం: శాసనమండలి స్థానిక సంస్థల నియోజకవర్గ ఉప ఎన్నిక కోసం సోమవారం మధ్యాహ్నం మూడు గంటలకు నామినేషన్లు దాఖలు గడువు ముగిసింది. ఉప ఎన్నిక నామినేషన్ల గడువు మూసే సమయానికి స్థానిక సంస్థల నియోజకవర్గానికి మొత్తం మూడు నామినేషన్లు దాఖలు అయినట్లు జాయింట్ కలెక్టర్, రిటర్నింగ్ అధికారి ఎస్ సేతు మాధవన్ వెల్లడించారు. నామినేషన్ల దాఖలుకు చివరి రోజైన సోమవారం ఇద్దరు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు ఎస్ కోట మండలం బొడ్డవర కు చెందిన ఇందుకూరి సుబ్బలక్ష్మి ఇండిపెండెంట్ అభ్యర్థిగా రెండు సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. ఎస్ కోట మండలం వసి గ్రామానికి చెందిన కారుకొండ వెంకటరావు ఇండిపెండెంట్ అభ్యర్థిగా ఒక సెట్ నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. ఇప్పటికే వైయస్సార్ కాంగ్రెస్ అభ్యర్థిగా శంబంగి వెంకట చినప్పల నాయుడు మూడు సెట్ల నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. ఇప్పటివరకు మొత్తం ముగ్గురు అభ్యర్థులు ఆరు సెట్ల నామినేషన్లను దాఖలు చేశారు. వైయస్సార్ కాంగ్రెస్ అభ్యర్థి ఎస్.వి. చిన్నప్పలనాయుడు సోమవారం బి-ఫారంను రిటర్నింగ్ అధికారికి అందజేశారు. నామినేషన్ పత్రాల స్క్రూటినీ మంగళవారం జరుగుతుంది.

ప్రశ్నిస్తే అరెస్టు చేస్తారా!

మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పల నరసయ్య

విశాలాంధ్ర-గజపతినగరం: రాష్ట్రంలో టిడిపి కక్షపూరిత పాలన సాగిస్తుందని గజపతినగరం మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పల నరసయ్య అన్నారు. సోమవారం ఆయన వైసిపి పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ చంద్రబాబు ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని ప్రజలు సోషల్ మీడియా కార్యకర్తలు ప్రశ్నిస్తే వారిని అన్యాయంగా అరెస్టు చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో పరిపాలన గాడి తప్పిందన్నారు. ఏ ఏ పథకాలు అయితే హామీలను ఇచ్చారో అమలు కావడం లేదని నిరుద్యోగ భృతి విద్యా దేవన ఆడవారకు 1500 రూపాయలు వంటి పథకాలు ఏమీ అమలు కాలేదని ఈ బడ్జెట్ లోనైనా వస్తే చాలా సంతోషమని అన్నారు. ఎక్కడ కూడా అభివృద్ధి కార్యక్రమాలు లేవు అని విమర్శించారు దీనిపై పోరాటం చేయడం ఒక ప్రతిపక్ష నాయకుడిగా మాకు బాధ్యత ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి గార తౌడు పార్టీ నాయకులు వి ముత్యాల నాయుడు. బెల్లాన తినాధరావు. కరణం ఆదినారాయణ . బూడి వెంకటరావు. గేదెల సింహాద్రి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం మేళవింపునకు ప్రతిబింబంగా ఉన్న బడ్జెట్

జనసేన నేత గురాన అయ్యలు హర్షం

విశాలాంధ్ర-విజయనగరం అర్బన్: అభివృద్ధి, సంక్షేమం మేళవింపునకు ప్రతిబింబంగా రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో వార్షిక బడ్జెట్ ప్రవేశపెట్టిందని జనసేన నేత గురాన అయ్యలు హర్షం వ్యక్తం చేశారు. సోమవారం ఆయన మీడియా తో మాట్లాడుతూ ఎన్నికల హామీల అమలుకు అద్దం పట్టే విధంగా బడ్జెట్ వుందన్నారు. గత పాలనలో మోసపోయిన అన్నీ వర్గాలకు, అన్నీ రంగాలకు న్యాయం చేసే విధంగా బడ్జెట్లో కూటమి ప్రభుత్వం కేటాయింపులు చేసిందన్నారు. రైతు అభ్యున్నతే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యంగా రూ.43,402 కోట్లతో ప్రత్యేకంగా వ్యవసాయ బడ్జెట్ను కూడా ప్రవేశ పెట్టిందన్నారు. జగన్ బడ్జెట్ సమావేశాలకు మొహం చాటేయడం బాధ్యత రాహిత్యమని, బాధ్యతలేని వారు ప్రతిపక్షం అనే మాట ఉచ్చరించే అర్హత లేదన్నారు.

బడ్జెట్లో అన్నివర్గాలు, రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యత

జిల్లా టిడిపి అధ్యక్షులు కిమిడి నాగార్జున

విశాలాంధ్ర-విజయనగరం అర్బన్: అన్ని వర్గాలు వారికీ మేలు చేసే బడ్జెట్ ను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఎన్డీయే కూటమి ప్రభుత్వం ప్రకటించిందని విజయనగరం జిల్లా టిడిపి అధ్యక్షులు కిమిడి నాగార్జున అన్నారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చన్నాయుడు ప్రవేశపెట్టిన బడ్జెట్ లో అన్ని రంగాలకు నిధులు కేటాయింపు జరిగిందన్నారు. ఇప్పటికే సామాజిక పింఛన్లు మొత్తం పెంపు జరిగిందని, దీపం పథకం -2 కింద ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్ లు ఇవ్వడానికి రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభం జరిగింది అని చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగ నియామకాల్లో క్రీడాకారులు కు 3 శాతం రిజర్వేషన్ కలిపించడం హర్ష నియమని చేప్పారు.. రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమంనకు ఈ బడ్జెట్ ఎంతో ఉపయోగ పడుతుందని అభిప్రాయపడ్డారు.

భార్యతో మనస్పర్ధల కారణంగా భర్త ఆత్మహత్య

విశాలాంధ్ర-బొబ్బిలి: మండలం, అలజంగి గ్రామంలో నివాసం ఉంటున్న రెడ్డి జగన్నాథం నాయుడు(49) వ్యక్తి గత కొంతకాలంగా చెడు వ్యసనాలకి బానిసై, రెండేళ్ల క్రితం నుంచి తన భార్య నుంచి దూరంగా ఉంటూ ఇంటి దగ్గరే ఒక్కడే ఉంటున్నాడు. ఇదిలా ఉండగా నిన్న రాత్రి 7:30 గంటల సమయంలో మండలం అలజంగి గ్రామంలో తన ఇంటిలో సీలింగ్ ఫ్యాన్ కు ఉరివేసుకొని ఆత్మహత్య కు పాల్పడి మృతి చెంది మూడు రోజులు కావడంతో ఇంటి నుండి దుర్గంతమైన వాసన రావడంతో ఇంటి పక్కన ఉన్నవారు గ్రామ రెవెన్యూ అధికారి సుధాకర్ కు సమాచారం ఇవ్వడంతో బొబ్బిలి పోలీసులకు గ్రామ రెవెన్యూ అధికారి ప్రియా చేశాడు. ఫిర్యాదు మేరకు పట్టణ సీఐ సతీష్ కుమార్ ఆదేశాల ఏ ఎస్ ఐ సన్యాసిరావు మృతుని భార్య రెడ్డి వాణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు నందు భాగంగా పంచాయతీ దారుల సమక్షంలో శవ పంచనామా నిర్వహించి,పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని వారి కుటుంబానికి అందజేశారు.

టీడీపీ హైడ్రామా..?

ఎమ్మెల్సీ ఎన్నికలలో పోటీకి అభ్యర్థిని నిలబెట్టని వైనం
చివరి క్షణంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి సుధారాజు నామినేషన్
అయోమయంలో టీడీపీ క్యాడర్

విశాలాంధ్ర-విజయనగరం: శాసనమండలి ఉప ఎన్నికలలో వైసీపీ నుంచి ఆపార్టీ ప్రకటించిన అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు నామినేషన్ ముగిసే సమయానికి మూడు సెట్లు నామినేషన్లు వేసారు. సోమవారం నామినేషన్ చివరి తేదీ కావడంతో అధికార కూటమి నుంచి అభ్యర్థి ఎవరూ నామినేషన్ వేయలేదు. దీంతో పోటీకి కూటమి సిద్ధంగా లేదని అందరూ భావించారు. కానీ అనూహ్యంగా సోమవారం టీడీపీ రాష్ట్ర కార్యదర్శిగా ఉన్న ఎస్కోట వైస్ ఎంపిపి ఇందుకూరి సుధారాజు చివరి నిమిషంలో వచ్చి రెండు సెట్లు నామినేషన్లు దాఖలు చేసారు. ఆమెతోపాటు ఆమె అనుచరుడు కె. వెంకటరావు సైతం నామినేషన్ వేసారు. ప్రస్తుతం ఈవిషయం ఆసక్తిగా మారింది. ఇక నామినేషన్ వేసేందుకు వచ్చిన సుధారాజుతో ఎస్కోట, జామి మండలాలకు చెందిన వలువురు టీడీపీ నేతలు రావడం విశేషం. ఒకవైపు తమ పార్టీ అభ్యర్థిని ప్రకటించకపోవడంతోపాటు సుధారాజు నామినేషన్ వేయడం చూసి టీడీపీ, కూటమి శ్రేణులు అయోమయంలో పడ్డారు.

ఇండిపెండెంట్గానే వేశాను.. ఇందుకూరి సుధారాజు

నామినేషన్ వేసేందుకు వచ్చిన సుధారాజు, టీడీపీ నేతలు

నేను ఈనామినేషన్ను ఇండిపెండెంట్గానే వేసానని, పార్టీకి ఈనామినేషన్కు ఎటువంటి సంభందం లేదని సుధారాజు మీడియా సమావేశంలో వెల్లడించారు. అన్ని ప్రశ్నలకు రెండు రోజులలో సమాధానం లభిస్తుందని తెలిపారు. రఘురాజు కోర్టు విషయాలపై తనకు సంభందంలే లేదన్నారు. తనకు పార్టీనుంచి ఎటువంటి అభ్యంతరాలు రాలేదన్నారు.

విశాలాంధ్ర
విజయనగరం
మంగళవారం 12, నవంబర్ 2024

ప్రకృతి వ్యవసాయ ప్రదర్శనను తిలకించిన కలెక్టర్

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : కలెక్టరేట్ ఆడిటోరియం వద్ద ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శనను జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ తిలకించారు. ప్రతీ సోమవారం కలెక్టరేట్‌లో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శన, విక్రయాలను నిర్వహిస్తున్న తెలిసిందే. ఈ వారం ఏర్పాటు చేసిన ప్రదర్శనను తిలకించి, ఉత్పత్తుల గురించి ఆరా తీశారు. కూరగాయల విత్తనాలను కలెక్టర్ కొనుగోలు చేశారు. ఆ ఉత్పత్తుల గురించి జిల్లా వ్యవసాయాధికారి విటి రామారావు, ప్రకృతి వ్యవసాయం ఎడి ఆనందరావు కలెక్టర్‌కు వివరించారు.

జెడ్పీ పాఠశాలకు ద విలేజ్ మైండ్స్ ప్రైవేట్ లిమిటెడ్

క్రీడా పరికరాలు వితరణ

విశాలాంధ్ర-మెరకముడిదాం: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు 50 వేల రూపాయల విలువగల క్రీడా పరికరాలను గ్రామీణ ప్రాంతాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలన్నా సంకల్పంతో అనేక గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్న విలేజ్ మైండ్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ,మెరకముడిదాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు 50వేలు రూపాయల విలువగల క్రీడా పరికరాలు, క్రీడా ఏకరూప దుస్తులు 20 జతలను అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ సీఈవో శ్రీమతి గాయత్రీ వెంకటేషన్ యం.డి.సంఘంరెడ్డి భానుమూర్తి ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నా విద్యార్థులు విద్యతోపాటు క్రీడారంగంలో కూడా రాణించాలన్న ఉద్దేశ్యంతో ఈ క్రీడా పరికరాలు అందజేశామన్నారు. విద్యార్థులు వీనిని సక్రమంగా వినియోగించుకొని రాష్ట్ర జాతీయ స్థాయి క్రీడల్లో రాణించి పాఠశాల కి ఉన్న ఊరికి దేశానికి మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ క్రీడా పరికరాలను సంస్థ యం.డి.తండ్రి అయిన సంగం రెడ్డి సన్యాసినాయుడు చేతులమీదుగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు కోట్ల ఎల్లంనాయుడు, అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు కె. ఎల్లం నాయుడు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల అభ్యున్నతికి పాటుపడుతున్న ద విలేజ్ మైండ్ సంస్థను అభినందిస్తూ తమ పాఠశాలకి క్రీడా పరికరాలు అందజేసినందుకు సంస్థ సీఈవో మరియు ఎండి లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించండి : సీఐ సతీష్‌కుమార్

విశాలాంధ్ర-బొబ్బిలి: జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాలతో సబ్ డివిజనల్ పోలీస్ అధికారి పి.శ్రీనివాసరావు గారి ఆధ్వర్యంలో పట్టణ సీఐ కే.సతీష్ కుమార్ ట్రాఫిక్ ఎస్ఐ వి.జ్ఞాన ప్రసాద్ సిబ్బంది నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో 60 వాహనాలు సీజ్ చేశారు.వాహనదారులు తమ వాహనాలను అనుమతి ఉన్నట్లే తమ భద్రతకు, ఇతర వాహనదారులు, పాదచారుల భద్రతకు కొన్ని బాధ్యతలను నిర్వహించాల్సి ఉంటుందన్నారు. అంతేకాకుండా, వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు, ఎం.వి. నిబంధనలు, రహదారి భద్రత ప్రమాణాలను పాటించడంతోపాటు, హెల్మెట్ ధరించడం, ద్విచక్ర వాహనంపై ఇద్దరు మాత్రమే ప్రయాణించడం, నిర్దిష్ట వేగంతోనే వాహనాలను నడపడం, నిబంధనలకు అనుగుణంగా నంబరు ప్లేట్స్ కలిగి ఉండడం, వాహనాల నిర్మాణాన్ని మారుస్తూ శబ్ద కాలుష్యానికి పాల్పడడం చట్టరీత్యా నేరమని వాహనదారులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. స్పెషల్ డ్రైవ్లో భాగంగా రెండు రోజుల్లో బొబ్బిలి పోలీస్ స్టేషన్ పరిధిలో 60 ద్విచక్ర వాహనాలు ఎం.వి. నిబంధనలను అతిక్రమించిన వాహనదారులకు ఈ- చలానాలు విధించగా, మైనరు డ్రైవింగు, ట్రిపుల్ రైడింగ్, ఇరెగ్యులర్ నంబరు ప్లేట్స్, సౌండు పొల్యూషను, సెల్ ఫోను డ్రైవింగు, డ్రైవింగు లైసెన్సు లేని వాహనదారుల వాహనాలను, రికార్డులు సక్రమంగా లేని 60 వాహనాలను సీజ్ చేసి, పోలీస్ స్టేషన్ పరిధిలో వుంచి కౌన్సిలింగ్ నిర్వహించి, తగు ఫైన్స్ వేసి వారి యొక్క వాహనాలను వారికి అప్పగించారు.

27 నుండి ఏఐఎస్ఎఫ్ 49వ రాష్ట్ర మహాసభలు

విశాలాంధ్ర-గజపతినగరం: ఆల్ ఇండియా స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 27 నుండి 30వ తేదీ వరకు విజయనగరంలో 49వ రాష్ట్ర మహాసభలు నిర్వహించనున్నట్లు స్టూడెంట్స్ ఫెడరేషన్ అధ్యక్షులు తెలిపారు. అందులో భాగంగా సోమవారం గజపతినగరంలో మహాసభలు నిర్వహించేందుకు చందాలు సేకరణ కార్యక్రమం చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని ఆరోపించారు. శిధిలా వ్యవస్థలో ఉన్న హాస్టల్ భవనాలను మరమ్మత్తులు చేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పురం అప్పారావు పాల్గొన్నారు.

శివాలయంలో ఎంపీపీ దంపతులు ప్రత్యేక అభిషేకాలు

విశాలాంధ్ర-గుర్ల: మండల కేంద్రంలోని ఉన్న శివాలయంలో కార్తీకమాసం రెండో సోమవారం సందర్భంగా శ్రీ ఉమా సాహిత కోటేశ్వర స్వామికి, శ్రీ ఉమా సాహిత రామలింగేశ్వర స్వామికి ఎంపీపీ దంపతులు పొట్నూరు సన్యాసినాయుడు, ప్రమీల ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేపట్టారు.

విద్యా, వ్యవసాయ, వైద్య రంగాలకు పెద్దపీట వేసిన బడ్జెట్

టీడీపీ నాయకులు డాక్టర్ సుంకరి రమణమూర్తి

విశాలాంధ్ర-గుర్ల: ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ రాష్ట్ర అభివృద్ధిని, భవిష్యత్తును ప్రతిబింబిస్తుందని ఉత్తరాంధ్ర విద్యార్థి సేన వ్యవస్థాపక అధ్యక్షులు తెలుగుదేశం పార్టీ నాయకులు డాక్టర్ సుంకరి రమణమూర్తి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత ప్రభుత్వంతో పోలిస్తే ఉన్నత విద్యారంగానికి, వ్యవసాయ రంగానికి, వైద్య ఆరోగ్య రంగానికి, బీసీ సంక్షేమానికి ఈ బడ్జెట్లో పెద్దపీట వేయడం జరిగిందని తెలిపారు. ముఖ్యమంత్రిగా ఎంతో అనుభవం కలిగిన చంద్రబాబు భవిష్యత్తు అవసరాల దృష్ట్యా ప్రతి పేదవాడికి మెరుగైన విద్య నాణ్యమైన వైద్యం వ్యవసాయానికి చేయూత ముఖ్య అంశాలుగా ఈ బడ్జెట్ ను రూపకల్పన చేసినట్టు స్పష్టమవుతుందన్నారు. 2023 24 వార్షిక బడ్జెట్లో వైకాపా ప్రభుత్వం ఉన్నత విద్యారంగానికి కేవలం 2065 కోట్లు కేటాయిస్తే ,ఈ ప్రభుత్వం 2326 కోట్ల కేటాయించిందని, వైద్య ఆరోగ్యం కుటుంబ సంక్షేమం కోసం గత ప్రభుత్వం 15882 కోట్లు కేటాయిస్తే, తెలుగుదేశం ప్రభుత్వం 18420 కోట్లు కేటాయించడం హర్షణీ యమని, ముఖ్యంగా రాష్ట్రంలో 76% ఉండే బీసీల సంక్షేమం కోసం అత్యధిక నిధులు కేటాయించడం పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞత తెలియజేశారు. వైకాపా ప్రభుత్వంలో సర్వనాశనమైన కొన్ని వ్యవస్థలు ఇప్పుడిప్పుడే గాడిని పడుతున్నాయని, వాటిని అభివృద్ధి పదం లోకి తీసుకెళ్లడం ఒక చంద్రబాబుకే సాధ్యమని ఆయన పేర్కొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులకు ఇబ్బంది లేకుండా చూడండి : తహశీల్దార్ హేమంత్ కుమార్

విశాలాంధ్ర-తెర్లాం: మండలంలో సోమవారం మండల సర్వసభ్య సమావేశ భవనములో నిర్వహించిన ధాన్యం కొనుగోలు కేంద్రం నిర్వాహకులకు, టెక్నికల్ అసిస్టెంట్లు డేటా ఎంట్రీ ఆపరేటర్ల సమావేశంలో ముఖ్యఅతిథిగా తాసిల్దార్ జి హేమంత్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 15 కొనుగోలు కేంద్రాలలో ఎలాంటి తప్పులు జరక్కుండా జాగ్రత్తగా పనిచేయాలని రైతులకు ఇబ్బంది లేకుండా చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సి ఎస్ డి టి స్వర్ణలత, మండల వ్యవసాయ అధికారి జి సునీల్ కుమార్, వివో ఏలు, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

బాలమిత్ర ఫౌండేషన్ 100 గ్రంథాలయ పుస్తకాలు వితరణ

విశాలాంధ్ర-మెరకముడిదాం : మండలంలో చినబంటుపల్లి ఎంపియుపి స్కూల్ లో బాలమిత్ర ఫౌండేషన్ హైదరాబాద్ వారు పాఠశాల విద్యార్థులకు 100 గ్రంథాలయ పుస్తకాలు ప్రధానోపాధ్యాయులు ఆల్తి రాంబాబు, వాలంటీర్ ఆర్. శంకర్ రావు అందజేయబడినవి. ఈ సందర్భంగా పుస్తక పఠనం విద్యార్థులలో విజ్ఞానం పెంపొందించుటకు, ఉపయోగ పడతాయని, నేటి సమాజంలో పుస్తక పఠనం విద్యార్థుల మేధోశక్తిని, పెంపొందిస్తాయని ప్రధానోపాధ్యాయులు ఆల్తి రాంబాబు అన్నారు. అదే విధంగా బాలమిత్ర ఫౌండేషన్ హైదరాబాద్ వారి సేవలను కొనియాడుతూ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం లో ఆంగ్ల భాషోపాధ్యాయులు. గాసాడ అప్పలనాయుడు,తెలుగు భాసోపాధ్యాయని కె.త్రివేణీ. ఆర్.నారాయణరావు, వి.మోహనరావు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలి

కాంగ్రెస్ జిల్లా యువజన అధ్యక్షుడు పూడి

విశాలాంధ్రవిజయనగరం ఫోర్ట్: విజయనగరం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం లో ఆంధ్రప్రదేశ్ యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు లక్కరాజు రామారావు ఆదేశాల మేరకు విజయనగరం జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు పూడి శ్రీనివాస్ ఆధ్వర్యంలో విజయ నగరం జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యాలయంలో విలేకరుల సమా వేశం ఏర్పాటు చేశారు . ఈ సందర్భంగా జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు పూడి శ్రీనివాస్ మాట్లాడుతూ లినౌకరిదేవ్-నిషానిహిలి మరియు లిశక్తి సూపర్ షిలి అనే అంశాల గురించి మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు ప్రభుత్వం కల్పించాలని కోరారు .మహిళా నాయకత్వం పెంపొందించాలని శక్తి సూపర్ షి ఇందిరా ఫెలోషిప్ కార్యక్రమం ద్వారా మహిళా యువతకు శిక్షణ తరగ తులను ఇండియన్ యూత్ కాంగ్రెస్ నిర్వహిస్తుందని ఈ కార్యక్రమాన్ని మహిళ యువత అందరూ సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమం లో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మరిపి విద్యా సాగర్ మరియు పార్టీ యువజన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సాగునీటి సంఘ ఎన్నికల ఓటర్ లిస్ట్ ప్రచురణ

విశాలాంధ్ర-గజపతినగరం: మండలంలోని కాలం రాజుపేట గ్రామంలో సోమవారం ఆ గ్రామ సర్పంచ్ గేదెల ఈశ్వరరావు వీఆర్వో మాధవి ఈనెల 21వ తేదీన జరుగు సాగునీటి సంఘ ఎన్నికలకు సంబంధించి 13వంతులు కాలువ నీటి సంఘం ఓటర్ లిస్టును ప్రచురించారు.

గ్రామ రెవెన్యూ అధికారులకు సంబంధం లేని విధులు అప్పగించవద్దు

తహశీల్దార్ శ్రీను కు వినతి

విశాలాంధ్ర-బొబ్బిలి : రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో విధులు నిర్వహిస్తున్న గ్రామ రెవెన్యూ అధికారులు రెవెన్యూ విధులే కాకుండా ఇతర శాఖలకు చెందిన పనులు కూడా అప్పగించడంతో రెవెన్యూ శాఖ అప్పగించిన విధులు నిర్వర్తించలేక తీవ్ర ఇబ్బందులు పడుతుంటే రెవిన్యూ శాఖతో సంబంధంలేని పనులను అప్పగించి తీవ్ర ఇబ్బందులు గురి చేస్తుందని తక్షణమే ప్రభుత్వం గ్రామ రెవెన్యూ అధికారులకు ఇతర శాఖలకు చెందిన పనులను అప్పగించకుండా మినహాయింపు ఇవ్వాలని గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం నాయకులు గొట్టాపు సింహాచలం పూడి శేఖర్, గాడి సత్యనారాయణ, ఈశ్వరరావు, మరిపి రవి, తదితరులు తహశీల్దార్ ఎం శ్రీను కు వినతి పత్రం అందజేశారు. తహశీల్దార్ ఎం శ్రీను మాట్లాడుతూ గ్రామ రెవెన్యూ అధికారులు సమస్యలను జిల్లా అధికారులకు తెలియజేస్తానని తెలిపారు.

ఆర్గానిక్ ఉత్పత్తులు అమ్మకం

విశాలాంధ్ర-శృంగవరపుకోట టౌన్: పట్టణం లోని తాసిల్దార్ కార్యాలయం వద్ద ఆర్గానిక్ ఉత్పత్తులు అమ్మకం చేస్తున్న ఆర్‌బి కే సిబ్బంది. మండలంలో గల రైతుల దగ్గర నుంచి సేకరించి నటువంటి ఆర్గానిక్ ఉత్పత్తులు ప్రతి సోమవారం తాసిల్దార్ వారి కార్యాలయం వద్ద స్టాల్ ఏర్పాటు చేసి అమ్మకాలు చేస్తున్నట్లు ఆర్‌బి కే నిర్వాహకులు సిరపరపు రాము తెలియజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆర్గానిక్ ఉత్పత్తులు వాడకం ఆరోగ్యానికి ఎంతో మంచిదని ఈ స్టాల్ ద్వారా కొర్రలు, రాగులు, ఊకలో, ఉలవలు, పండ్లు కూరగాయలును ప్రతి సోమవారం ఇక్కడ విక్రయాలు చేస్తామని పట్టణవాసులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైన ఎన్ కె ఆర్ పురం పాఠశాల విద్యార్థులు.

విశాలాంధ్ర-వేపాడ: మండలంలోని నీలకంఠరాజపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి క్రీడ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సి.హెచ్. వెంకటరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-14 బాల్ బ్యాట్మెంటన్ రాష్ట్ర స్థాయి పోటీలకు బి.యశ్వంత్, జ్ఞాన ప్రసన్న, ఎంపికయ్యారన్నారు.అలాగే అండర్-14 త్రో బాల్ పోటీలకు సి. హెచ్. వంశీ, అండర్ -17 బాస్కెట్బాల్ పోటీలకు టీ. లోకేష్ ఎంపికయ్యారని తెలిపారు.అలాగే అండర్ -19 బాల్ బ్యాట్మెంటన్ పోటీలకు పి. కుమార్ ఎంపికైనట్లు చెప్పారు.ఈ సందర్భంగా పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు ఎం. అవతారం, పాఠశాల సిబ్బంది, విద్యార్థులను అభినందించారు.

వాహనదారులకు అవగాహన

విశాలాంధ్ర-గజపతినగరం: గజపతినగరం పోలీస్ స్టేషన్ వద్ద సోమవారం సిఐ జీఏవి రమణ ఎస్ఐ కే లక్ష్మణరావు వాహన దారులకు అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నియమాలు పాటించాలని హెల్మెట్ ధరించడం. మైనర్లకు వాహనాలు ఇవ్వరాదని. తమ వాహనాలకు సంబంధించిన రికార్డులను తమ వెంట ఉంచుకోవాలని తగు సూచనలు సలహాలు అందజేశారు.

బెల్ట్ షాపులు నెరవేస్తే కేసులు తప్పవు

విశాలాంధ్ర-రామభద్రపురం : మండల పరిధిలోని 22 గ్రామపంచాయతీలో బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని ఎక్సైజ్ సబ్ ఇన్స్పెక్టర్ శ్రవణ్ కుమార్ అన్నారు. సోమవారము తాసిల్దార్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. గతంలో బెల్ట్ షాప్ లు నిర్వహించే వారిపై కేసులు నమోదు అయిన కారణంగా వారిని తాసిల్దార్ సులోచన రాణి వద్ద బైండోవర్ చేస్తున్నామని అన్నారు. బెల్ట్ షాపులు నిర్వహించడం చట్ట విరుద్ధమని అందుకే ఎవరైనా గొలుసు దుకాణాలు నిర్వహిస్తే కేసులు నమోదు చేసి కోర్టులో పెట్టడం జరుగుతుందని హెచ్చరించారు. అలాగే గ్రామాలలో బెల్ట్ షాపులు పాట నిర్వహించిన కఠిన చర్యలు ఉంటాయని అన్నారు. అలాగే అక్రమంగా సారా తయారుచేసిన నిల్వ ఉంచిన చర్యలు తప్పవని. ఈ కార్యక్రమంలో బొబ్బిలి ఎక్సైజ్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

అభిమాని కుటుంబానికి 10వేలు ఆర్థిక సహాయం చేసిన సినీ హీరో శ్రీకాంత్

విశాలాంధ్ర-విజయనగరం ఫోర్ట్: సినీ హీరో శ్రీకాంత్ తన అభిమాని శంకరావు మృతిచెందడంతో ఆయన కుటుంబ సభ్యులకు 10,000 రూపాయలను హీరో శ్రీకాంత్ అందజేశారు. ఇటీవల అకాల మరణం చెందిన విజయనగరం పట్టణం సినీ నటుడు శ్రీకాంత్ ఫ్రాన్స్ సభ్యులు జి. శంకరరావు కుటుంబ సభ్యులకు శ్రీకాంత్ ఆయన కార్యదర్శి వి .ఎన్. శ్రీనివాసరావు శంకరరావు భార్య లీలావతి కి 10 వేల రూపాయలు ను అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీకాంత్ అభిమాన సంఘం నాయకులు కోడూరు నారాయణ రావు ,శ్రీనివాస్ రావు, రమేష్ బాబు, సన్యాసిరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రముఖ మృదంగ విద్వాంసులు కమలాకర్ రావు లేని లోటు తీర్చలేనిది

విశాలాంధ్ర-విజయనగరం పోర్ట్: రాజమండ్రి కి చెందిన ప్రముఖ మృదంగ విద్వాంసులు వి. కమలాకర్ రావు సోమవారం ఉదయం 7:30 గంటలకు రాజమండ్రిలో తుది శ్వాస విడిచారు. ఆయనకు విజయనగరం తో అలాగే ఫ్రెండ్స్ ఫైన్ ఆర్ట్స్ అసోసియేషన్ తో 60 దశాబ్దాల అనుబంధం ఉన్నది. అనేక కచేరీలు వాయించారు. ఆయన మృతి సంగీత ప్రపంచానికి తీరని లోటు అని ప్రముఖ మృదంగ విద్వాంసుడు ఫ్రెండ్స్ ఫైన్ ఆర్ట్స్ అసోసియేషన్ కార్యదర్శి డాక్టర్ మండపాక రవి, అధ్యక్షులు ధవళ సర్వేశ్వరరావు, కోశాధికారి ధన్వాద సుధాకర్, ఉపాధ్యక్షులు డాక్టర్ కే .ఏ పద్మప్రియ, దూసి శివరామ శర్మ, మహేశ్వర రావు, గౌరవ సలహాదారులు చాగంటి కొండలరావు, పూడిపెద్ది రాధాకృష్ణ శాస్త్రి ఒక ప్రకటనలో సంతాపం తెలియజేసారు. అలాగే రోటరీ దశిగి పేర్రాజు మ్యూజిక్ అకాడమీ అధ్యాపకులు విద్యార్థులు ఆయన చిత్రపటానికి నివాళులు అర్పించి సంతాపం తెలియజేశారు.

ఉత్తమ సేవకుడిగా మూడోసారి అవార్డు కలెక్టర్ చే అందుకున్న మహమ్మద్ రఫీ

విశాలాంధ్ర-బొబ్బిలి : మైనారిటీ వెల్ఫేర్ డే, జాతీయ విద్యా దినోత్సవ సందర్భంగా విజయ జిల్లా కలెక్టర్ ఆడిటోరియం లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో పట్టణానికి చెందిన హుదా ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ బెస్ట్ సర్వీసెస్ విభాగం లో మూడవసారి ఎన్నిక కావడం జరిగింది.ఈ సందర్భంగా విజయనగరం జిల్లా కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ చేతుల మీదుగా కమిటీ తరఫున మెహమ్మద్ రఫీ అవార్డును ప్రదానం చేశారు. మహమ్మద్ రఫీకి అవార్డు రావడంతో పట్టణ ప్రజలు ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

బెల్ట్ నిర్వాహకులకు తాసిల్దార్ హెచ్చరిక

విశాలాంధ్ర-పూసపాటిరేగ/ విజయ నగరం: పూసపాటి రేగ మండలంలో ఇటీవల ఎక్సైజ్ శాఖ జరిపిన దాడులలో పట్టుబడిన పదిమంది బెల్ట్ షాప్ నిర్వాహకులను సోమవారం స్థానిక తహసీల్దార్ ఎదుట హాజరు పరిచినట్లు ఎక్సైజ్ సీఐ వి.రవికుమార్ తెలిపారు. ఈ సందర్భంగా వీళ్ళని బైండ్ ఓవర్ చేయడం జరిగిందని, ఇప్పటినుండి సంవత్సరం కాలం వరకు మీపై మరలా కేసులు నమోదైతే లక్ష రూపాయల జరిమానాలతో పాటు జైలు శిక్ష విధించడం జరుగుతుందని తాసిల్దార్ హెచ్చరించినట్లు సీఐ తెలిపారు

పశుసంవర్ధక కార్యక్రమాలపై కార్యదర్శి ఎం.ఎం.నాయక్ అధికారులతో సమీక్ష

స్వర్ణాంధ్ర విజన్ లక్ష్యాలకు అనుగుణంగా పాల ఉత్పత్తి పెంచాలని ఆదేశం



విజయనగరంఫోర్ట్ /డెంకాడ : ఉప ఎన్నికల పరిశీలకులుగా జిల్లాకు విచ్చేసిన రాష్ట్ర పశు సంవర్ధక శాఖ కార్యదర్శి ఎం.ఎం నాయక్ సోమ వారం తమ శాఖ కార్యక్రమాలపై జిల్లా అధికారులతో సమీక్ష జరిపారు. నగరంలోని బహుళార్థ పశువైద్య శాలను, పశు వ్యాధి నిర్ధారణ కేంద్రాన్ని సందర్శించి వాటి ద్వారా అందుతున్న సేవలను తెలుసుకున్నారు. పశు సంవర్ధక శాఖ జె.డి. కార్యాలయాన్ని సందర్శించి జిల్లాలో పశువుల టీకా కార్యక్రమం, గొర్రెలు, మేకల్లో నట్టల నివారణ మందు వేసే కార్యక్రమంపై ఆరా తీశారు. స్వర్ణాంధ్ర విజన్ లక్ష్యాల సాధనకు రూపొందించిన కార్యాచరణ ప్రణాళిక అమలు జరుగుతున్న తీరును సమీక్షించారు. జిల్లాలో స్వర్ణాంధ్ర లక్ష్యాలకు అనుగుణంగా పాల ఉత్పత్తి పెంచాలని జె.డి వై.వి.రమణను ఆదేశించారు. అనంతరం డెంకాడ మండలం రఘుమండ పశువైద్య కేంద్రాన్ని పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. పశు గణాభి వృద్ధి కోసం చేపడుతున్న చర్యలు, పశుగణన జరుగుతున్న తీరును సమీక్షించారు. ఆ శాఖ జె.డి. వై వి రమణ కూడా పాల్గొన్నారు

60మంది గర్భిణీలకు భోజన ఏర్పాటు

విశాలాంధ్ర-జామి: మండల కేంద్రమైన జామిలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో నెలవారీ తనిఖీలకు వచ్చిన 60 మంది గర్భిణీలకు, వారి సహాయకులకు, ఆశాలు, ఇతర సిబ్బందికి జామి శ్రీసత్యసాయి భజనమండలి అధ్యక్షుడు విన్నకోట సీతారామయ్య (నానాజీ) మధ్యాహ్నం భోజన ఏర్పాట్లు చేసారు. ఈకార్యక్రమాన్ని పిహెచ్‌సీ వైద్యాధికారిణి ప్రారంభించారు. అనంతరం నానాజీ మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు నెలవారీ భోజనాన్ని అందించేందుకు దాతలుగా ముందుకురావాలని కోరారు. ఈకార్యక్రమంలో సాయి భక్తులు నాయుడు, రమణి పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసుల్లో దర్యాప్తు వేగవంతం చేయండి

ఎస్పీ వకుల్ జిందల్

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ డిఎస్పీ స్థాయి అధికారులతో సమీక్షా సమావేశంను నిర్వహిం చారు. విజయనగరం, బొబ్బిలి, చీపురుపల్లి సబ్ డివిజను పరిధిలో నమోదై, దర్యాప్తులో ఉన్న అట్రాసిటీ కేసులను జిల్లా ఎస్పీ సమీక్షించి, ఆయా కేసుల్లో ఇంత వరకు జరిగిన దర్యాప్తు తీరును జిల్లా ఎస్పీ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ వకుల్ జిందల్, ఐపిఎస్ మాట్లాడుతూ - అట్రాసిటీ కేసుల్లో చట్ట ప్రకారం వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు. అట్రాసిటీ కేసుల్లో ఫిర్యాదు అందిన వెంటనే పోలీసు స్టేషనుల్లో కేసులు నమోదయ్యే విధంగా సంబంధిత డిఎస్పీలు పర్యవేక్షించాలన్నారు. అట్రాసిటీ కేసుల్లో దర్యాప్తు చేపట్టే డిఎస్పీ స్థాయి అధికారులు విధిగా సంఘటనా స్థలాలను సందర్శించాలని, ప్రత్యక్ష సాక్ష్యులను విచారణ చేయాలని అధికారులను ఆదేశించారు. కేసుల దర్యాప్తును 60 రోజుల్లో పూర్తి చేసి, నిందితులపై అభియోగ పత్రాలను న్యాయ స్థానాల్లో దాఖలు చేయాలన్నారు. అట్రాసిటీ కేసుల్లో దర్యాప్తు పెండింగులో ఉండుటకు గల కారణాలను పరిశీలించి, ఆయా అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టి, దర్యాప్తు పూర్తి చేయాలన్నారు. కేసుల్లో నిందితులపై నేరారోపణలు న్యాయ స్థానంలో నిరూపణ చేసేందుకు అవసరమైన ప్రధాన సాక్షుల విచారణ చేయాలని, సాంకేతిక ఆధారాలను సేకరించాలని, ధృవ పత్రాలను సంబంధిత అధికారుల వద్ద నుండి, ఫోరెన్సిక్ ల్యాబ్ నుండి త్వరితగతిన పొందే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. అభియోగ పత్రాల తయారు చేయుటలో న్యాయ నిపుణుల సలహాలు, సూచనలు తీసుకోవాలన్నారు. అట్రాసిటీ కేసులు దర్యాప్తులో ఉండుటకుగల కారణాలను అధికారులను అడిగి తెలుసుకొని, దర్యాప్తు అధికారులకు జిల్లా ఎస్పీ పలు సూచనలు చేసి, దిశా నిర్దేశం చేసారు. అట్రాసిటీ కేసుల్లో బాధితులకు పరిహారం సకాలంలో అందేందుకు ఎప్పటికప్పుడు ప్రతిపాదనలను సిద్ధం చేసి, కలెక్టరు ఆఫీసుకు పంపాలని, సకాలంలో బాధితులకు పరిహారం అందే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో బొబ్బిలి డిఎస్పీ పి.శ్రీనివాసరావు, చీపురుపల్లి డిఎస్పీ ఎస్.రాఘవులు, డిటిసి డిఎస్పీ ఎం.వీరకుమార్, డిసిఆర్బి ఇన్చార్జ్ సిఐ ఆర్.వి.ఆర్.కే. చౌదరి, ఎస్ఐ రాజేష్ పాల్గొన్నారు.

జెఎన్‌టియుజివి లో ప్లానిటేషన్ కార్యక్రమం



విశాలాంధ్ర విజయనగరం టౌన్: జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం-గురజాడ విజయనగరం విశ్వవి ద్యాలయాన్నీ గ్రీన్ క్యాంపస్‌గా మార్చడానికి గ్రీన్‌క్లబ్ సోమ వారం ను ప్రారంభించారు. దీనిలో భాగంగా ప్లానిటేషన్ కార్యక్ర మాన్ని యూని వర్సిటీ పరిధిలో గల గెస్ట్ హౌస్ ముందు భాగంలో యూనివర్సిటీ ఇంఛార్జ్ ఉప- కులపతి ప్రొఫెసర్ డి.రాజ్యలక్ష్మి, విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.జయసుమ, ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశ్వవిద్యాలయాన్ని గ్రీన్ క్యాంపస్ గా మార్చడానికి కంకణం కట్టుకొని ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలోపి ఎన్ఐటిఎస్ సిఎస్ సి విభాగ ప్రొఫెసర్ ఎన్ పద్మజ ,డైరెక్టర్ ఆఫ్ ఎవల్యూషన్ ప్రొఫెసర్ కె. బాబులు , ఎన్.ఎస్.ఎస్ కో- ఆర్డినేటర్ వి మణికుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారులు డాక్టర్. బి.ధర్మారావు, డాక్టర్. ఎ. శ్రీనివాసులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, ఇతర విద్యార్థులు పాల్గొన్నారు.

పట్టని అధికారులు

విశాలాంధ్ర-విజయనగరం ఫోర్టు :నగరంలో పేరిశాస్త్రి స్కూల్ అద్దేపల్లి వారి వీధిలో రోడ్డు మధ్యలో కాలువ పనులు ఇటీవల ప్రారంభించారు. ఆ పనులు పూర్తవక కాలువ మధ్యలో వాహనదాలకు ఇబ్బంది కలగకుండా తాత్కాలికంగా ఒక మూడు పలకలను ఏర్పాటు చేశారు. వాహనదారులు అటుగా వెళుతున్న సమయంలో అందులో ఒక పలక ఇరిగి పోవడంతో ద్విచక్ర వాహనం మీద ఉన్న తండ్రి కూతుర్లకు అక్కడికక్కడే కాలువలో పడిపోయారు. ఇద్దరికీ స్వల్ప గాయాలు అయ్యాయి. వెంటనే స్థానికులు వారికి సహాయపడి ఆసుపత్రికి తరలించారు. ఇప్పటికైనా ఆర్ అండ్ బి వాళ్ళు స్పందించి కాలువ పనులు పూర్తి చేయాలని స్థానికులు కోరుకుంటున్నారు.

నెలాఖరులోగా పిఏసిఎస్‌ల కంప్యూటీకరణ

జాయింట్ కలెక్టర్ ఎస్. సేతు మాధవన్

విశాలాంధ్ర-విజయనగరం : ఈ నెలాఖరులోగా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల కంప్యూటీకరణ పూర్తి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్ ఆదేశించారు. డిసెంబరు నుంచి లావాదేవీలన్నీ కంప్యూటర్ ద్వారానే జరుగుతాయని తెలిపారు. పిఏసిఎస్‌ల సిఈఓలు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, బ్రాంచ్ మేనేజర్లు, పర్సన్ ఇన్‌చార్జిలు, డిసిసిబి బ్రాంచ్ మేనేజర్లతో కలెక్టరేట్‌లో సోమవారం సమావేశాన్ని నిర్వహించారు. కంప్యూటరైజేషన్, అనలైజర్, పార్కింగ్ అకౌంట్ తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ, పిఏసిఎస్‌ల కంప్యూటరీకరణను ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుందన్నారు. దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో ఈ ప్రక్రియ జరుగుతుండగా, మన రాష్ట్రంలో ప్రగతి గణనీయంగా ఉందని ప్రశంసలు లభించిన విషయాన్ని గుర్తు చేశారు. నిర్దేశించిన లక్ష్యం మేరకు ఈ నెలాఖరులోగా కంప్యూటరీకరణను ఎట్టి పరిస్థితిలోనూ పూర్తి చేయాల్సిందేనని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో సాంకేతిక సమస్యలు ఏమైనా ఉత్పన్నం అయితే, డిసిసిబి మేనేజర్లు, సిఈఓను సంప్రదించాలని సూచిం చారు. పిఏసిఎస్ లలో సుమారు 2,42,000 మంది సభ్యులుగా ఉన్నప్పటికీ, చురుగ్గా ఉన్న సభ్యుల సంఖ్య చాలా తక్కువగా ఉందన్నారు. చురుగ్గా లేని సభ్యులను సర్వజన సభలో తీర్మాణం పెట్టి తొలగించాలని సూచించారు. ప్రతీఒక్కరి నుంచి ఆధార్ నంబరు సేకరించాలని జెసి చెప్పారు. చక్కని పనితీరును ప్రదర్శిస్తున్న పిఏసిఎస్‌లను ఈ సందర్భంగా అభినందించారు. ఈ సమావేశంలో జిల్లా సహకార అధికారి పి.రమేష్, డిసిసిబి సిఈఓ ఉమామహేశ్వర్రావు తదితరులు పాల్గొన్నారు.